Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170–9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170–9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

బుధవారం 11-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 272 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## అమరావతికి సరికొత్త

# మెరుగులు

- ప్రపంచస్థాయి హంగులతో రాజధాని నిర్మాణం
- సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ఐకానిక్ నిర్మాణాలు

అమరావతి, మార్చి 10 ( ఇది కద నిజం): నవ్యాంధ్ర రాజధాని అమరావతిని ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 59వ అథారిటీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన సీఎం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్గదర్శకాలను జారీ చేశారు. ముఖ్యంగా "గ్రీన్ అండ్ బ్లూ" కాన్సెప్ట్‌తో ప్రకృతి ఒడిలో అత్యాధునిక నగరాన్ని నిర్మించాలని ఆదేశించారు.


**తెలుగు వెలుగులు చిందేలా ఐకానిక్ విగ్రహం:**

అమరావతి అంటే కేవలం భవనాల సముదాయం కాదని, అది తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక అని చంద్రబాబు పేర్కొన్నారు. నీరుకొండ వద్ద సుమారు 167 ఎకరాల విస్తీర్ణంలో భారీ టూరిజం ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ఇక్కడ తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత నందమూరి తారక రామారావు ఐకానిక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇది పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా, తెలుగు సంస్కృతికి నిలయంగా ఉండాలని ఆకాంక్షించారు.

**స్వయం సమృద్ధి నమూనా:**

ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా, రాజధాని పనులను వేగవంతం చేసేందుకు 'సెల్ఫ్ ఫైనాన్సింగ్' ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భూ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలని చెప్పారు.

మిగతా 2లో ..



## జగన్ పాలనలో అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్

- మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం
- రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారు - ఏటా రూ.71,800
- కోట్ల వడ్డీల భారం - శ్వేతపత్రం విడుదల చేసిన మంత్రి



2 లో

అమరావతి, మార్చి 10 (ఇది కద నిజం): గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా చిన్నాభిన్నమైందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అవసాన దశలో చేసిన అప్పుల వల్ల రాష్ట్రంపై పెనుభారం పడిందని ఆరోపించారు. రాష్ట్ర అప్పులు ప్రస్తుతం రూ.9.70 లక్షల కోట్లకు చేరాయని కాగ్ నివేదికే స్పష్టం చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

## నేడు వైఎస్ జగన్ సంచలన ప్రెస్ మీట్

- కూటమి సర్కార్‌పై ఎదురుదాడికి సిద్ధం!
- మంత్రి పార్థసారథి చేసిన ఆరోపణలకు ధీటైన కౌంటర్ ఇచ్చే అవకాశం
- తాడేపల్లిలో ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం



2 లో

అమరావతి, మార్చి 10 (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వైఎస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులు, పెండింగ్ హామీలు మరియు నేడు మంత్రి కొలుసు పార్థసారథి చేసిన తీవ్రస్థాయి ఆరోపణలపై జగన్ ఘాటుగా స్పందించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## టీటీడీని రాజకీయ అడ్డాగా మారుస్తున్నారు

- మాజీ మంత్రి కాకాణి

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్సీపీ సీనియర్ నేత నిప్పులు - పవిత్రతను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపణ



2 లో


తాడేపల్లి, మార్చి 10 (ఇది కద నిజం): తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమలను వివాదాల్లోకి లాగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు.

రాజకీయ పునరావాస కేంద్రంగా టీటీడీ బోర్డు

టీటీడీ బోర్డు నియామకాల నుంచి మొదలుకొని, రోజువారీ నిర్ణయాల వరకు ప్రతి విషయంలోనూ రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని కాకాణి ఆరోపించారు.

## తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత నిరాహార దీక్ష

- వెలుగుమట్ల ఘటనపై నిరసన
- కవిత అరెస్ట్ హైడ్రామా
- హైదరాబాద్‌కు తరలింపు
- బాధితులకు మద్దతు
- రాహుల్‌కు బహిరంగ లేఖ



2 లో

## తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం


- బుధవారం శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం
- శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి - రాజ్‌భవన్‌లో ముగిసిన ఏర్పాట్లు



2 లో

## గల్ఫ్‌లో మండుతున్న యుద్ధం

- ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ 'ఫైర్ అండ్ ఫ్యూరీ' హెచ్చరిక
- చమురు రవాణాను అడ్డుకుంటే 20 రెట్లు తీవ్రంగా దాడి చేస్తాం - తిప్పికొట్టిన ఇరాన్ - 11వ రోజుకు చేరిన విధ్వంసం



2 లో




2 లో

## లిక్కర్ పాలసీ కేసు

### : ట్రయల్ కోర్టు వ్యాఖ్యలపై హైకోర్టులో ఈడీ పోరాటం!

న్యూస్ డెస్క్, 10 మార్చి (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన ఢిల్లీ మద్యం విధానం కేసు ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టు లో ఉంది. ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్, కల్వకుంట్ల కవిత, మనీష్ సిసోడియా సహా ఇతర నిందితుల విడుదలకు సంబంధించి ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తాజాగా విచారించింది. నిందితులను డిశ్చార్జ్ చేస్తూ ఫిబ్రవరి 27, 2026న ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పులో ఈడీ దర్యాప్తు సంస్థపై కొన్ని తీవ్రమైన విమర్శలు చేసింది.

## తెలంగాణ గోదావరి పుష్కరాలపై అప్‌డేట్




2 లో

న్యూస్ డెస్క్, 10 మార్చి (ఇది కద నిజం): హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. వచ్చే ఏడాది రాబోయే గోదావరి పుష్కరాలను భక్తులకు సౌకర్యవంతంగా, భద్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారి సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం, రవాణా మరియు ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ఆయా శాఖల సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

Registered No : APTEL/25/A0818
# ఇది కద నిజం


## తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం

హైదరాబాద్, మార్చి 10 (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేస్తున్న ఆయనను రాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం ప్రత్యేక విమానంలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది.

ఎయిర్‌పోర్ట్‌లో సీఎం స్వాగతం

శివ ప్రతాప్ శుక్లా దంపతులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, ఆయన నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు.

బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం

నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నేడు ఉదయం రాజ్‌భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు హాజరుకానున్నారు.

బడ్జెట్ సమావేశాలపై దృష్టి

గవర్నర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన కీలకమైన విధుల్లో నిమగ్నం కానున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుంది. గతంలో హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయంగా మరియు పరిపాలనా పరంగా అపారమైన అనుభవం ఉన్న శివ ప్రతాప్ శుక్లా రాకతో రాజ్‌భవన్ కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి.

జిష్ణుదేవ్ వర్మకు వీడ్కోలు

మరోవైపు, ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఇప్పటికే వీడ్కోలు పలికారు. నేడు జిష్ణుదేవ్ వర్మ ముంబైలో మహారాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.

## టీటీడీని రాజకీయ అడ్డాగా మారుస్తున్నారు - మాజీ మంత్రి కాకాణి

మొదటి పేజీ తరువాయి

"టీటీడీని భక్తుల సేవా కేంద్రంగా కాకుండా, కూటమిలోని నాయకులకు రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. నిబంధనలకు విరుద్ధంగా తమ అనుకూల వ్యక్తులను బోర్డులో కూర్చోబెట్టి, శ్రీవారి ఆస్తులను, సంప్రదాయాలను కాలరాస్తున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు.

అభాండాలతో భక్తుల మనోభావాల గాయం

గత కొద్ది రోజులుగా లడ్డూ ప్రసాదం మరియు ఇతర అంశాలపై కూటమి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఆయన తీవ్రంగా ఖండించారు. కేవలం వైఎస్సార్సీపీపై బురదజల్లడమే లక్ష్యంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ ప్రతిష్ఠను పెంచేలా ఎన్నో సంస్కరణలు తెచ్చామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పవిత్రతను కాపాడటంలో విఫలమైందని విమర్శించారు.

స్వామివారి విషయంలో రాజకీయం తగదు

"అధికారం కోసం దేవుడిని కూడా వాడుకోవడం చంద్రబాబు నైజం. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరికాదు. టీటీడీ విషయంలో రాజకీయ విమర్శలు ఆపకపోతే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదు" అని కాకాణి హెచ్చరించారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, భక్తులకు వాస్తవాలు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే..

రాష్ట్రంలో శాంతిభద్రతల విఫల్యం, ఇచ్చిన హామీల అమలులో జాప్యం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కూటమి నాయకులు టీటీడీ చుట్టూ వివాదాలు సృష్టిస్తున్నారని కాకాణి అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా రాజకీయాలు మానుకొని, తిరుమల పవిత్రతను కాపాడేలా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు.

ముఖ్య విమర్శలు:

టీటీడీ బోర్డు నియామకాల్లో రాజకీయ జోక్యం పెరిగింది.
రాజకీయ లబ్ధి కోసం శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని వివాదాల్లోకి లాగారు.
భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.
వైఫల్యాల నుంచి తప్పించుకోవడానికే ఈ దేవుడి రాజకీయం.

## తెలంగాణ గోదావరి పుష్కరాలపై అప్‌డేట్



మొదటి పేజీ తరువాయి

కందకుర్తిలో మొదలై భద్రాచలం వరకు.. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు. వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో చర్చించి గోదావరి నది ప్రాంత సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్‌గా మంత్రులు సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీ వేశారు. రోడ్లు భవనాలు శాఖ ఈ పుష్కర ఏర్పాట్లలో కీలక భూమిక పోషించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మికతకు, టెంపుల్ టూరిజానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. గోదావరి నది మహారాష్ట్రలో పుట్టినా.. నది పరివాహకం ఎక్కువ తెలంగాణ రాష్ట్రంలో ఉంటుంది. గోదావరి ఆది పుష్కరాలు 26-06-2027 న మొదలై 07-07-2027 వరకు కొనసాగుతాయి కాబట్టి అన్ని విభాగాలు అలెర్ట్‌గా ఉండాలి. నిజామాబాద్ జిల్లా కందకుర్తిలో మొదలై భద్రాచలం వరకు ప్రవహిస్తుంది.. ఈ వందల కిలోమీటర్ల ప్రాంతంలో ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు(బాసరా, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం) ఎంతో చరిత్ర కలిగిన గుడులు ఉన్నాయి.

పుష్కర ఘాట్లు నిర్మాణం..కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే పవిత్రనది గోదావరి. ఈ గోదావరి నదిని తెలంగాణ గంగా నదిగా పిలుచుకుంటాం.. కాబట్టి రానున్న పుష్కరాలు అంతే స్థాయిలో నిర్వహించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలి. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ అన్ని విధాల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హ్యామ్ మోడల్ రోడ్లు కనెక్టివిటీతో పాటు, అవసరమైన కాంక్రీట్ రోడ్లు, పుష్కర ఘాట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు ఉండాలి. అవసరమైన పుష్కర ఘాట్లు, ఘాట్లకు వెళ్ళే రహదారులు, మౌళిక సదుపాయాలు పై దృష్టి సారించాలి. ప్రధానంగా వాహనాల రాకపోకలు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై దృష్టి సారించాలి. అందుకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు, పోలీసు యంత్రాగం సమన్వయంతో వచ్చే మీటింగ్ నాటికి ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలి. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్ జగన్ సంచలన ప్రెస్ మీట్

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక గణాంకాలపై అమీతుమీ

రాష్ట్ర అప్పులు రూ.9.70 లక్షల కోట్లకు చేరాయని, గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందంటూ నేడు మంత్రి పార్థసారథి గణాంకాలతో సహా విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో, గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన వ్యయం, సంక్షేమ పథకాల అమలు మరియు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అప్పుల విషయంలో అనుసరిస్తున్న తీరుపై జగన్ వాస్తవాలను బయటపెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా "గత తొమ్మిది నెలల్లో కూటమి చేసిన అప్పులెన్ని?" అనే అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ లేదా వివరణాత్మక ప్రకటన చేసే అవకాశం ఉంది.

సూపర్ సిక్స్ – హామీల అమలుపై నిలదీత

ఇప్పటికే 'ఎక్స్' వేదికగా మహిళా దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని జగన్ నిలదీశారు. 'తల్లికి వందనం', 'ఆడబిడ్డ నిధి' వంటి పథకాల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని ఆయన ఆరోపించారు. రేపటి ప్రెస్ మీట్‌లో ఈ పథకాలపై లబ్ధిదారులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం తమపై బురదజల్లుతోందని ఆయన వాదించనున్నారు.

శాంతిభద్రతలు మరియు రాజకీయ దాడులు

రాష్ట్రంలో వైఎస్సార్సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులు, పార్టీ నాయకుల ఆస్తుల లక్ష్యంగా సాగుతున్న చర్యలపై జగన్ తీవ్రంగా స్పందించనున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, బుగ్గన రాజేంద్రనాథ్ వంటి నేతలపై ప్రభుత్వం చేస్తున్న భూకబ్జా ఆరోపణలను ఆయన తిప్పికొట్టే అవకాశం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రజల ముందు ఉంచేందుకు జగన్ సిద్ధమయ్యారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం

వచ్చే ఏడాది ప్లీనరీ నిర్వహణ మరియు 18 లక్షల మంది కార్యకర్తలతో సైన్యాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఇప్పటికే జగన్ కసరత్తు చేస్తున్నారు. రేపటి ప్రెస్ మీట్ ద్వారా అటు ప్రభుత్వానికి హెచ్చరికలు పంపడంతో పాటు, ఇటు కేడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఆయన ప్రసంగం ఉండబోతున్నట్లు సమాచారం.

## జగన్ పాలనలో అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్ - మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం

మొదటి పేజీ తరువాయి



దివాలా తీసిన ఖజానా – పెరిగిన వడ్డీల భారం

జగన్ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాల వల్ల రాష్ట్రానికి ఏటా రూ.71,800 కోట్ల వడ్డీల భారం పడుతోందని మంత్రి వివరించారు. "జగన్ నిర్వాకం వల్ల బ్యాంకులు కూడా ఆంధ్రప్రదేశ్‌కు అప్పులు ఇచ్చేందుకు వెనకాడుతున్నాయి. 2024 మొదటి మూడు నెలల్లోనే జగన్ ప్రభుత్వం రూ.27,025 కోట్లు అప్పు చేస్తే, మా కూటమి ప్రభుత్వం గత 9 నెలల్లో కేవలం రూ.53 వేల కోట్లతో నెట్టుకొస్తోంది" అని ఆయన తులనాత్మక గణాంకాలను వివరించారు.

సాక్షి, భారతి సిమెంట్స్‌కే మేలు

ప్రభుత్వ సొమ్మును సొంత సంస్థలకు మళ్లించుకోవడమే లక్ష్యంగా గత ప్రభుత్వం పనిచేసిందని పార్థసారథి విమర్శించారు. భారతి సిమెంట్స్ ధరను కేవలం మూడు రూపాయలు పెంచడం ద్వారా ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని, ప్రకటనల ద్వారా సాక్షి మీడియాకు సుమారు రూ.400 కోట్ల మేర లబ్ధి చేకూర్చారని ఆయన ఆరోపించారు. కేవలం తన సొంత ప్రయోజనాల కోసమే జగన్ పనిచేస్తూ రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు.

సంక్షేమం మరియు అభివృద్ధి వైపు అడుగులు

వైఫల్యాల నుంచి రాష్ట్రం కోలుకుంటోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఉద్యోగులకు రూ.20 వేల కోట్లు చెల్లించింది. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటికే 20 నెలల్లో 6.50 లక్షల మందికి ఉపాధి కల్పించాం" అని ఆయన పేర్కొన్నారు.


రైతన్నకు భరోసా

గత ప్రభుత్వం సర్పంచ్‌లను, రైతులను మోసం చేసిందని, కానీ తమ ప్రభుత్వం రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సాధికారతకు తాము కట్టుబడి ఉన్నామని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు.

ముఖ్యాంశాలు:

రాష్ట్ర అప్పులు రూ.9.70 లక్షల కోట్లకు చేరాయని కాగ్ నివేదిక వెల్లడి.
గత ప్రభుత్వంలో సాక్షి, భారతి సిమెంట్స్‌కే ప్రాధాన్యత లభించిందన్న ఆరోపణ.
20 నెలల్లో 6.50 లక్షల మందికి ఉద్యోగాల కల్పన.
ధాన్యం సొమ్ము 24 గంటల్లోనే రైతుల ఖాతాలోకి.

## లిక్కర్ పాలసీ కేసు




న్యూస్ డెస్క్, 10 మార్చి (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన ఢిల్లీ మద్యం విధానం కేసు ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టు లో ఉంది. ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్, కల్వకుంట్ల కవిత, మనీష్ సిసోడియా సహా ఇతర నిందితుల విడుదలకు సంబంధించి ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తాజాగా విచారించింది. నిందితులను డిశ్చార్జ్ చేస్తూ ఫిబ్రవరి 27, 2026న ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పులో ఈడీ దర్యాప్తు సంస్థపై కొన్ని తీవ్రమైన విమర్శలు చేసింది.

ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణ కాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈడీ తరపున హాజరైన అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఎస్.వి. రాజు వాదనలు వినిపిస్తూ, సిబిఐకి సంబంధించిన అంశాల్లో ఈడీపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని కోర్టుకు విన్నవించారు.

విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ, ట్రయల్ కోర్టు ఉత్తర్వులోని సంబంధిత పేరాలను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కొన్ని అంశాలను గతంలోనే సవాలు చేసిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ఏఎస్‌జీ ఎస్.వి. రాజు నిందితుల విడుదల ఉత్తర్వులోని నిర్దిష్ట భాగాలను ఉటంకిస్తూ, దర్యాప్తు సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్న ఆ వ్యాఖ్యలను తొలగించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఉభయ పక్షాల వాదనలను విన్న ఢిల్లీ హైకోర్టు, ఈ వ్యవహారంపై తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## గల్ఫ్‌లో మండుతున్న యుద్ధం

వాషింగ్టన్/టెహ్రాన్, మార్చి 10 (ఇది కద నిజం): మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు విస్ఫోటనం దిశగా పయనిస్తున్నాయి. ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య సాగుతున్న భీకర పోరు 11వ రోజుకు చేరిన వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" పేరుతో సాగుతున్న ఈ దాడులలో ఇరాన్ ఏమాత్రం దూకుడు ప్రదర్శించినా, ఆ దేశం కోలుకోలేని విధంగా దెబ్బతీస్తామని ట్రంప్ హెచ్చరించారు.

ట్రంప్ హెచ్చరిక: 'మరణం, నిప్పు మరియు ఆగ్రహం'

స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ ద్వారా జరిగే అంతర్జాతీయ చమురు రవాణాను అడ్డుకోవాలని చూస్తే ఇరాన్ మూల్యం చెల్లించుకోక తప్పదని ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. "ఇరాన్ గనుక చమురు ప్రవాహాన్ని అడ్డుకుంటే, ఇప్పటివరకు జరిగిన దానికంటే 20 రెట్లు తీవ్రంగా అమెరికా దాడి చేస్తుంది. ఇరాన్ మళ్లీ ఒక దేశంగా నిలబడటం అసాధ్యం అయ్యేలా అత్యంత కీలకమైన లక్ష్యాలను మేము నాశనం చేస్తాము. వారిపై మరణం, నిప్పు మరియు ఆగ్రహం వర్షిస్తాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ఆశిస్తున్నట్లు చెబుతూనే, అప్పటివరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

ఇరాన్ ఘాటు కౌంటర్ – క్షిపణి దాడుల హెచ్చరిక:

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇది అమెరికా చేస్తున్న "సైనిక దురాక్రమణ" అని అభివర్ణించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల మధ్య కాల్పుల విరమణ చర్చలకు తావులేదని స్పష్టం చేసింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్లు మాట్లాడుతూ, ఇకపై ఇజ్రాయెల్ పై ప్రయోగించే క్షిపణులన్నీ ఒక టన్ను కంటే ఎక్కువ బరువున్న వార్‌హెడ్లతో ఉంటాయని హెచ్చరించారు. అమెరికా బేస్‌లే లక్ష్యంగా దాడులు చేస్తామని, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఇరాన్ ప్రతిజ్ఞ చేసింది.

నేడే అత్యంత తీవ్రమైన దాడులు – ఇజ్రాయెల్ వ్యూహం:

మరోవైపు, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్ మాట్లాడుతూ, మంగళవారం దాడులు యుద్ధంలోనే అత్యంత తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇరాన్‌లోని టెహ్రాన్, ఇస్ఫహాన్ వంటి ప్రధాన నగరాల్లోని క్షిపణి కేంద్రాలు, కమాండ్ సెంటర్లపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ముమ్మరం చేసింది. ఇప్పటికే ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, ఇరాన్ తన పట్టు కోల్పోకుండా గల్ఫ్ దేశాలైన యూఏఈ, బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లతో విరుచుకుపడుతోంది.

ప్రపంచంపై ప్రభావం:

ఈ యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు బ్యారెల్ ఒక్కంటికి 114 డాలర్ల మార్కును దాటాయి. విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయారు. రష్యా ఈ యుద్ధం వల్ల చమురు ధరల పెరుగుదల ద్వారా లాభపడుతోందని ఐరోపా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## అమరావతికి సరికొత్త మెరుగులు

మొదటి పేజీ తరువాయి

సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, హైకోర్టు మరియు అసెంబ్లీ భవనాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

క్రియేటివ్ సిటీ – స్పోర్ట్స్ హబ్:

అమరావతిని కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వినోదం, క్రీడలు మరియు విజ్ఞానానికి కేంద్రంగా మార్చాలని చంద్రబాబు పట్టుబట్టారు. అమరావతిలో 'స్పోర్ట్స్ సిటీ' ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాల నిర్మాణం జరగాలని సూచించారు. అలాగే, వినూత్న ఆలోచనలతో వచ్చే యువత కోసం 'క్రియేటివ్ సిటీ'ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

క్రియేటివ్ సిటీ – స్పోర్ట్స్ హబ్:

అమరావతిని కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వినోదం, క్రీడలు మరియు విజ్ఞానానికి కేంద్రంగా మార్చాలని చంద్రబాబు పట్టుబట్టారు. అమరావతిలో 'స్పోర్ట్స్ సిటీ' ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాల నిర్మాణం జరగాలని సూచించారు. అలాగే, వినూత్న ఆలోచనలతో వచ్చే యువత కోసం 'క్రియేటివ్ సిటీ'ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

వేగంగా మౌలిక సదుపాయాలు:

రాజధాని ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ మరియు విద్యుత్ సరఫరా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూములిచ్చిన రైతులకు ప్లాట్ల అభివృద్ధిలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, వారికి అన్ని సదుపాయాలతో కూడిన లేఅవుట్లను అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముఖ్య అంశాలు:

నీరుకొండ వద్ద 167 ఎకరాల్లో భారీ పర్యాటక కేంద్రం.
ఎన్టీఆర్ ఐకానిక్ విగ్రహం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్.
సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుల ద్వారా రాజధాని అభివృద్ధి.
అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీ మరియు క్రియేటివ్ సిటీ.
రైతులకు కేటాయించిన లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం.

## తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత నిరాహార దీక్ష



న్యూస్ డెస్క్, 10 మార్చి (ఇది కద నిజం): ఖమ్మం నగర శివారు ప్రాంతమైన వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. గత అర్థరాత్రి హైడ్రామా నడుమ ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టులతో తన దీక్షను ఆపలేరని కవిత స్పష్టం చేశారు. ఖమ్మం అంబేద్కర్ భవన్ వద్ద నిన్న రాత్రి ఆమె దీక్షకు దిగగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం ఆమె దీక్షను భగ్నం చేసి హైదరాబాద్ కు తరలించారు. నేడు ఉదయానికి హైదరాబాద్ లో ఉన్న జాగృతి కార్యాలయానికి చేరుకున్న కవిత.. వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా తన దీక్షను అక్కడే కొనసాగించనున్నట్లు తెలిపారు. బాధితుల ఇళ్లు కూల్చిన ప్రభుత్వమే.. వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్లను కూల్చినచోటే తిరిగి వాటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన్ నివాసితులకు న్యాయం చేసేంతవరకూ తన పోరాటం ఆగదని కవిత స్పష్టం చేశారు.

భూదాన్ భూములంటేనే పేదలకు ఇచ్చిన భూములని ఆమె పేర్కొన్నారు. వెలుగుమట్ల బాధితులకు మద్దతిస్తామని, వారికి మద్దతుగానే దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి తమ దీక్ష కొనసాగుతూనే ఉందన్నారు. 31 ఎకరాల పేదల భూమిని పెద్దవారికి ముట్టజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వాపోయారు. భూదాన్ భూముల్లోనే బాధితులకు డబుల్ బెడ్రూమ్ రూమ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో పేరుకు ముగ్గురు మంత్రులు ఉన్నా అక్కడి బాధితుల పరిస్థితి దారుణంగా తయారైందని అసహనం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ వెలుగుమట్లలో ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ రాహుల్ కు బహిరంగ లేఖ రాస్తున్నట్లు కవిత తెలిపారు.

## ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు



ఇది కద నిజం : రామంతపూర్ భగయత్ వెంకట సాయి నగర్ కాలనీ లో నిర్వహించిన బస్తి బాట కార్యక్రమంలో ఏ డి ఈ రవీందర్ మరియు ఏ ఈ కిరణ్ కుమార్ కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు కాలనీ ప్రజల విద్యుత్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వినియోగదారుల ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. సన్నగా మారిన కండక్టర్ వైర్‌లను భద్రతా కేబుల్ వైర్‌తో భర్తీ చేయడం తో పాటు, కాలనీలో ఉన్న లో వోల్టేజ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఏ సమయంలోనైనా విద్యుత్ సమస్యల పరిష్కారం అందేలా విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని ఏ డి ఈ రవీందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఆర్ గోవింద్, రామకృష్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు

## లంగర్ హౌస్ చెరువు వద్ద అక్రమ నిర్మాణాలు.. తహసీల్దార్‌కు ఫిర్యాదు



ఇది కద నిజం : హైదరాబాద్ లంగర్ హౌస్ చెరువు పరిసరాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని వివేకానంద యువజన సంఘం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించింది. చెరువు గట్టుకు ఆనుకుని వాకింగ్ ట్రాక్ ప్రాంతాన్ని తొలగించి రోడ్డు వేసి నిర్మాణాలు చేపడుతున్నారని సంఘం ఆరోపించింది. ఈ నిర్మాణాలు చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (FTL) పరిధిలో జరుగుతున్నాయని పేర్కొంది.

ఈ విషయంపై రెవెన్యూ, సర్వే అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ ఫిర్యాదును ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్, శ్రీకాంత్, స్రవంత్, సిద్ధార్థలు తహసీల్దార్‌కు సమర్పించారు.

## కార్వాన్ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ సమీక్ష



ఇది కద నిజం :ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ సోమవారం కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ మోతీ మహల్, హషీమ్ నగర్, లంగర్ హౌస్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి పైప్‌లైన్లు, నీటి కాలుష్యం, తక్కువ నీటి ఒత్తిడి సమస్యలు, కాలువలు మరియు వీడీసీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ మరియు జీహెచ్ఎంసీ అధికారులు, ఎఐఎంఐఎం మాజీ కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## నవాబుపేటలో ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు



ఇది కద నిజం,నవాబుపేట: నవాబుపేట మండల కేంద్రంలో భారత దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలను దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా ఆడపిల్లల విద్య కోసం సావిత్రిబాయి పూలే అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. చదువు ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని, నేటి తరం ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎమ్మార్పియస్ సీనియర్ నాయకులు రవి కుమార్ మాదిగ, దళిత అవార్డు గ్రహీత శివరాజ్, జాన్ రత్నం, అంజయ్య, దేవయ్య, శ్యామ్, లక్ష్మణ్, బద్రి, పాండు, దశరథ్, ఈశ్వర్, పాండు, శ్రీధర్, శ్రీనివాస్, వెంకట్, శ్రీనివాస్ మరియు ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యరధి డిగ్రీ కాలేజ్‌లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు



ఇది కద నిజం ,చింతల్: యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు మరియు వాటి వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు చింతల్‌లోని భాగ్యరధి డిగ్రీ కాలేజ్లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అలవాట్లు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాయుడు ,డిఐ ధనుంజయ్ మరియు వారి బృందం కూడా పాల్గొని మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగంపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను కూడా తెలియజేశారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ , డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే బీకాం, బీఎస్సీ, బీబీఏ విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## గుండుమాల్ జడ్.పి.హెచ్.ఎస్ లో గ్రాండ్ గా అనువల్ డే కార్యక్రమం




నారాయణ పేట్, 10 మార్చి (ఇది కద నిజం): గుండుమాల్ మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో అనువల్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.పాఠశాల హెడ్ మాస్టర్, యం. ఇ. ఓ. శేఖర్ రెడ్డి.మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డయం. ఇ. ఓ శేఖర్ రెడ్డి తో పాటు.ఉపాధ్యాయ బృందం. రవీందర్ రెడ్డి. పరం జ్యోతి. మల్లికార్జున్. సాయప్ప.కాశప్ప. లక్ష్మి నారాయణ. మనోహర్. రాజు. వెంకటేష్. రాజు సరో?డే. బాలకిష్టయ్య. శ్రీనివాస్. కవిత. స్రవంతి. ఉమాదేవి. యు.ఉమాదేవి. శిరీష. స్వప్న. శ్రీదేవి. దివ్య.మరియు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికగా అనువల్ డే కార్యక్రమం నిలిచిందని ఉపాధ్యాయులు తెలిపారు.ప్రతిభ కనపరిచిన అబ్బాయి లకు అమ్మాయి లకు బహుమతులు అందచేశారు.టీచర్ పరంజ్యోతి ఉపన్యాసం అక్కడి విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని తల్లి తండ్రులను ఆకట్టుకుంది.

# వడగాల్పులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ‘హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026’ ఆవిష్కరణ

### రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత




అమరావతి, మార్చి 10(ఇది కద నిజం) : రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.

స్థానిక తాడేపల్లి లోని మంగళవారం ఏపిఎస్డీఎంఏ కార్యాలయంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్ మెంట్స్, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో ఎండ తీవ్రత, వడగాల్పుల సంసిద్ధతపై రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాల్పుల దృష్ట్యా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ‘హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ – 2026’ ను మంత్రి ఆవిష్కరించారు. హీట్ వేవ్ మరణాలు లేకుండా శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణ సంస్థ మరియు ఆర్టీజీఎస్ నుండి అందే వడగాల్పుల హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఒక్క ప్రాణం కూడా వడదెబ్బ వల్ల పోకూడదనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి పనులు చేయకుండా పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడే వారి కోసం ఆసుపత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు మరియు అంబులెన్సులను సిద్ధం చేయాలని వైద్య శాఖను ఆదేశించారు.

బస్టాండ్లు, మార్కెట్లు, కూడళ్లు మరియు పర్యాటక ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపుల ద్వారా మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయాలని సూచించారు. ఎండల వల్ల పశువులకు ముప్పు కలగకుండా గ్రామాల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నిరంతరం నింపాలని, పశు గ్రాసం విషయంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే ఎండల దృష్ట్యా గృహ అవసరాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్ డబ్ల్యూ ఎస్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలు మండల, గ్రామ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. దేవాలయాలు, టూరిస్ట్ స్పాట్ల వద్ద త్రాగు నీటి సదుపాయం, మెడికల్ క్యాంపులు నిరంతరం ఉండాలని జిల్లా కలెక్టర్లను మంత్రి అనిత ఆదేశించారు.

## పేద వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం,మార్చి 10 (ఇది కద నిజం) : రాజకీయాలకు అతీ తంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధి దారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సహాయం పొందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

# కలెక్టర్ పరిశీలన



సికింద్రాబాద్(ఇది కద నిజం) :99రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా సనత్ నగర్ నియోజక వర్గం బన్సీలాల్ పేట్ ను కలెక్టర్ దాసరి హరి చందన సందర్శించారు. జీ హెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలసి శిథిలావస్థకు చేరిన వాంబే పథకంలోని భవనాలను కలెక్టర్ పరిశీలించారు. పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకుల ఇళ్లను వారు పరిశీలించి గోడలు బీటలు వారడం, స్లాబుల నుండి పెచ్చులు ఊడిపడుతుండడం గమనించారు.

అంగన్ వాడి, ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలోకి వెళ్ళి, అక్కడ రోజువారీ బయోవేస్ట్ ను వేరుగా చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. రెండు చోట్ల ఉన్న ఖాళీ స్థలంలో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని జోనల్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమగ్ర రిపోర్ట్ తీసుకొని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నిపుణులు రిపోర్టుల ఆధారంగా వీటిని కూల్చి వేసి నూతన భవనాలు నిర్మించడమా లేక మరమ్మతులు సరిపోతాయనే అంశం తెలుస్తామన్నారు

కలెక్టర్ తో పాటు జీహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కే అలివేలు మంగతాయారు, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆర్ పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తాసిల్దార్ పాండు నాయక్ అధికారులు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్





## వైష్ణవి చైతన్య కోలీవుడ్ ఎంట్రీ

### స్టార్ హీరోతో రొమాన్స్ చేయబోతున్నట్లు ఇన్‌స్టా పోస్ట్‌తో కన్ఫర్మ్!

టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ వైష్ణవి చైతన్య తన కెరీర్‌లో మరో బిగ్ స్టెప్ వేసింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి, 'బేబీ' సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌ను ఊపేసిన ఈ భామ, ఇప్పుడు కోలీవుడ్‌లో పాగా వేసేందుకు సిద్ధమైంది. తెలుగులో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న వైష్ణవి, ఇప్పుడు ఏకంగా తమిళ స్టార్ హీరో ఆర్య సరసన నటించే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ స్టార్ హీరో ఆర్య కెరీర్‌లో 40వ మైలురాయిగా తెరకెక్కుతున్న 'ఆర్య-40' చిత్రంలో వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకుంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది. కేవలం ఆఫర్ దక్కించుకోవడమే కాదు, ఆ సినిమా కోసం అప్పుడే కష్టపడటం కూడా మొదలుపెట్టింది. జిమ్‌లో హీరో ఆర్యతో కలిసి వర్కవుట్స్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ, "ఆర్య-40 లోడింగ్.. పని జరుగుతోంది" అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

తెలుగులో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్న వైష్ణవి ఇప్పుడు పక్క రాష్ట్రం తమిళనాడులో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ఆర్య వంటి మాస్ ఫాలోయింగ్ ఉన్న హీరోతో జోడీ కట్టడం వైష్ణవి కెరీర్‌కు పెద్ద ప్లస్ పాయింట్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. వైష్ణవి షేర్ చేసిన జిమ్ ఫోటో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. "తెలుగులో ఎలాగైతే స్టార్‌గా ఎదిగావో, తమిళ ఇండస్ట్రీలో కూడా నెంబర్ వన్ ప్లేస్‌కు చేరుకోవాలి" అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఫన్నీ మీమ్స్ షేర్ చేస్తూ నెట్టింట రచ్చ చేస్తున్నారు. మొత్తానికి వైష్ణవి చైతన్య తన క్రేజ్‌ను కోలీవుడ్ వరకు విస్తరించడం చూస్తుంటే, త్వరలోనే ఆమె సౌత్ ఇండియాలోనే బిజీ హీరోయిన్ అయ్యేలా కనిపిస్తోంది.

## లావణ్య త్రిపాఠికి ఆన్‌లైన్ వేధింపులు

### సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన మెగా కోడలు!

టాలీవుడ్ నటి, మెగా వారసుడు వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి తన పరువుకు భంగం కలిగించే వారిపై న్యాయ పోరాటానికి దిగారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తనపై, మెగా కుటుంబంపై అసభ్యకరమైన పోస్టులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్న అకౌంట్లపై ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరంతరం వేధింపులకు గురిచేస్తూ, తన ప్రైవసీకి భంగం కలిగిస్తున్నారనే ఉద్దేశంతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా 'పర్పుల్ క్రెయాన్00' అనే ఖాతా ద్వారా గత కొంతకాలంగా లావణ్యను టార్గెట్ చేస్తూ అసభ్యకరమైన కామెంట్లు వస్తున్నట్లు సమాచారం. తన క్యారెక్టర్‌ను కించపరచడమే కాకుండా, కుటుంబ సభ్యులను కూడా వివాదాల్లోకి లాగడంపై లావణ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేవలం విమర్శలు చేయడం వేరు, కానీ అసభ్యతకు పాల్పడటం నేరమని భావించిన ఆమె, పోలీసుల ద్వారా నిందితులకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఐటీ చట్టం సెక్షన్ 67 (అశ్లీల సమాచారాన్ని ప్రసారం చేయడం) భారత న్యాయ సంహిత సెక్షన్లు 78, 79 కింద కేసులు నమోదు చేశారు. ఈ అకౌంట్ వెనుక ఉన్న వ్యక్తులను ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించే పనిలో సైబర్ క్రైమ్ విభాగం నిమగ్నమైంది. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల మీద విమర్శలు చేయడం వేరు, కానీ వారి వ్యక్తిగత విషయాల గురించి అసభ్యంగా మాట్లాడటం నేరమని ఈ కేసు ద్వారా లావణ్య స్పష్టం చేశారు. తప్పు చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడాలని ఆమె పట్టుదలతో ఉన్నారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై విషం చిమ్మే వారికి ఈ కేసు ఒక హెచ్చరికగా మారుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



## అల్లు అర్జున్ గొప్ప మనసు

### భారీ పేలుడు బాధితురాలికి అండ



పాన్ ఇండియా స్టార్ హీరో అల్లు అర్జున్ మరోసారి తన ఉదారతను చాటుకుంటుకున్నాడు. ఓ అనాథ బాలికకు అండగా నిలిచి బరోసా కలిపించాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనలో తండ్రిని కోల్పోయి, దిక్కుతోచని స్థితిలో ఉన్న దుర్గ అనే మానసిక దివ్యాంగురాలి దీనగాథ అల్లు అర్జున్‌ను కదిలించింది. తండ్రి మరణంతో అనాథగా మిగిలిన ఆ బాలిక భవిష్యత్తుకు భరోసా కల్పించాలని నిర్ణయించుకున్న అల్లు అర్జున్, ఆమె సంరక్షణ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. కేవలం తెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ తాను 'హీరో' అని నిరూపించుకుంటూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే తన సంప్రదాయాన్ని ఆయన కొనసాగించారు.

ఈ మానవీయ కార్యక్రమంలో భాగంగా, దుర్గ నిత్యావసరాలు, పోషణ కోసం ప్రతి నెలా రూ. 7,500 చొప్పున ఆర్థిక సహాయాన్ని అల్లు అర్జున్ అందించనున్నారు. ఆయన ఆదేశాల మేరకు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు వేట్లపాలెం గ్రామానికి వెళ్లి దుర్గను స్వయంగా కలిసి, ఆమెకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఆ బాలికకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక బాధ్యతతో స్పందించిన అల్లు అర్జున్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

## ఇది నిశ్చితార్థం కాదు

### అదిరిపోయే ట్విస్ట్ ఇచ్చిన హీరో సాయి శ్రీనివాస్

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పి ఓ ఇంటివాడు కాబోతున్నాడనే సంగతి తెలిసిందే. అంతే కాకుండా.. తనకు కాబోయే భార్యతో ఉన్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో సాయి శ్రీనివాస్ సీక్రెట్‌గా ఎంగేజ్మెంట్ చేసేసుకున్నాడు అంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. దీనిపై క్లారిటీ ఇస్తూ తాజాగా సాయి తన సోషల్ మీడియా వేదికగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టాడు.

'నా కావ్యమ్మకు.. జీవితానికి ఓ స్వంత అందమైన సమయం ఉంటుంది.. అది నిన్ను నా ప్రపంచంలోకి తీసుకువచ్చింది. నువ్వు నా లైఫ్‌లోకి వచ్చినందుకు థాంక్యూ. నీ రాకతో నా డేస్ మొత్తం సంతోషం అండ్ ఆనందంతో నిండిపోయాయి. నీ ముఖంలోని చిరునవ్వు ఎప్పటికీ పోనివ్వకుండా చూసుకుంటాను.. మనం ఎప్పటికీ కలిసి ఉండే రోజు కోసం నేను వేచి ఉండేలేకపోతున్నా.. ప్రేమతో నీ శ్రీని...' అని తన పియాన్సీతో ఉన్న ఫొటోలను షేర్ చేశాడు. అలాగే నిశ్చితార్థం అయిపోయింది అని అనుకుంటున్న వారిని ఉద్దేశిస్తూ.. 'అడుగుతున్న ప్రతి ఒక్కరికీ.. ఇది నిశ్చితార్థం కాదు.. కేవలం ఫ్యామిలీ అనౌన్స్‌మెంట్ మాత్రమే. వేడుకలు ఇంకా ప్రారంభం కాలేదు..తేదీలు త్వరలో ప్రకటించబడతాయి' అంటూ చెప్పుకొచ్చాడు.

కాగా.. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో కావ్య రెడ్డిని వివాహం చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో వీరి రోకా వేడుక ఇరు కుటుంబాల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రోకా వేడుక కావ్య రెడ్డి నివాసంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దర్శకులు బోయపాటి శ్రీను, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, నిర్మాతలు శిరీష్, సాహు గారపాటి, రామ్ ఆచంట, మిర్యాల రవీందర్ రెడ్డి, నాగ వంశీ, కేకే రాధామోహన్, ధీరజ్ మొగిలినేని, హీరోయిన్ సంయుక్త తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ కాగా.. ప్రతి ఒక్కరు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకున్నాడని భావించారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి నిశ్చితార్థం, వివాహ తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలపడంతో ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు.

